క్లుప్తంగా

గోనయ్య సేవలు మరువలేనివి



గోనయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు కాముని గోనయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోమారంలో ఆయన విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ నర్సింహరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు చంద్రగౌడ్, హన్మంత్‌రెడ్డి, సీతారం రెడ్డి, కుంట లక్ష్మణ్, నవీన్, బాలకృష్ణ, నర్సింగ్, తదితరులు ఉన్నారు.

గుంతలు పూడ్చండి



రోడ్డు పక్కన మట్టి కొట్టుకుపోవడంతో ఏర్పడిన గుంత

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని చెర్లపల్లి పంచాయతీ పరిధిలోని వర్దవానిచెరువు తండా సమీపంలోని ప్రధాన రోడ్డు ప్రమాదకరంగా ఉంది. గతంలో కురిసిన వర్షాలకు బీటీ రోడ్డు పక్కన ఉన్న మట్టి కొట్టుకు పోయింది. దీంతో రోడ్డు పక్క పెద్ద కయ్యలా ఏర్పడింది. అలాగే రోడ్డు పక్కన చిన్న చిన్న చెట్లు పెరగడంతో వాహనదారులకు గుంత కనిపించడంలేదు. అనుకోకుండా ఎవరైనా రోడ్డు కిందకు దిగితే వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రోడ్డుపక్క ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మండల్ పరిషత్ నిధులతో బోరు



టీ.మాందాపూర్‌లో బోరుడ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

చిన్నశంకరంపేట(మెదక్): సేవాలాల్ ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న గ్రామపెద్దలకు, మండల ప్రజాప్రతినిధులకు రుణపడి ఉంటామని టీ.మాందాపూర్ తండా సర్పంచ్ శారద అన్నారు. ఆదివారం మండలంలోని టీ.మాందాపూర్‌తండాలోని సేవాలాల్ ఆలయం వద్ద మండల పరిషత్ నిధులతో బోరు డ్రిల్లింగ్‌ను ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్ సర్పంచ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, మడూర్ రైతు సహకార సంఘం ఉపాధ్యక్షుడు బీమరి యాదగిరి, ఉపసర్పంచ్ యాదగిరి, తండా నాయకులు భద్రనాయక్, శ్రీనునాయక్, ఆశోక్‌నాయక్, రవి, మోహన్ పాల్గొన్నారు.

కేజ్‌వీల్‌తో బీటీ రోడ్లు ఛిద్రం



అధ్వానంగా కామారంతండా రోడ్డు

చిన్నశంకరంపేట(మెదక్): బీటీరోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్ల రాకపోకలు సాగిస్తుండడంతో మండలంలోని పలు గ్రామాల రహదారులు ఛిద్రమయ్యాయి. ఫలితంగా ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ప్రయాణించేప్పుడు బైక్ అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని టీ.మాందాపూర్ నుంచి మడూర్ మీదుగా మిర్జాపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డు కేజీవీల్ రాకపోకలతో ధ్వంసమై రోడ్డంతా పాడైపోయింది. అలాగే శంకరంపేట రహదారి నుంచి కామారంతండా మీదుగా వల్లూర్ జాతీయ రహదారి వరకు ఉన్న బీటీ రోడ్డు కూడా కేజీవీల్ ట్రాక్టర్ తిప్పడంతో రోడ్డంత ఛిద్రమైంది. రాత్రి సమయాల్లో బైక్‌పై వచ్చే ప్రయాణికులు పట్టుతప్పి పడిపోతున్న సంఘటనలు పెరుగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

మనోహరాబాద్(తూప్రాన్): మండంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అందమైన ముగ్గులు వేసిన వారికి ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. కాగా ముగ్గుల పోటీలను నిర్వహించడానికి, బహుమతులకు గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సంతోష్ పంతులు సహకారం అందించారని యూత్ సభ్యులు తెలిపారు. అంతకు ముందు యువత గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ పంతులు, నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భోగి సంబరాలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటతో పాటు గ్రామాల్లో భోగి పండగ సంబరాలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేగుంట ఎంపీటీసీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో హనుమాన్ వీధిలో యువతీ యువకులతో భోగి మంటలు వేశారు. చందాయిపేట సర్పంచ్ స్వర్ణలత ఆధ్వర్యంలో కైట్ ఫెస్ట్‌ను నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేగుంటలో పిల్లలకు ఉచితంగా గాలిపటాలను అందించారు.

రుస్తుంపేటలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేటలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న వారికి కూడా బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలకు సర్పంచ్ విజయభాస్కర్ రాజు, గుండం శంకర్, శివశంకర్ బహుమతులు అందజేశారు.



మనోహరాబాద్(తూప్రాన్): విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో ముగ్గులు వేస్తున్న యువతులు, మహిళలు



చందాయిపేటలో..



నర్సాపూర్ రూరల్: బహుమతులు అందజేస్తున్న సర్పంచ్



పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీలో భోగి మంటలు

అంగరంగ వైభవంగా గోదాదేవి కల్యాణం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీగోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వాహించారు. ఆలయ అర్చకులు విష్ణుకాంత్ ఆధ్వర్యంలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ఆలయంలో గోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్, భజన మండల సభ్యులు శ్రీశైలం, నర్సింలు, విఠల్, లింగం, వెంకటయ్య, శ్రీధర్, రాకేశ్, వెంకట్, రవిసాగర్, వరుణ్, భూమయ్య, రాములు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తమన్నగారి కృష్ణవేణి మధుసూదన్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిజాంపేట(మెదక్): కల్వకుంటలో ..



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో గోదాదేవి, రంగనాయక స్వామి కల్యాణం

ప్రకృతి పండుగ మకర సంక్రాంతి

చిన్నశంకరంపేట(మెదక్): భారతీయ పండగలన్ని ప్రకృతితో ముడిపడినవేనని, అలాంటి పండగే మకర సంక్రాంతి అని ఆర్ఎస్ఎస్ సామాజిక సమరత జిల్లా బాధ్యుడు అముద వెంకటేశం అన్నారు. నార్సింగి మండల కేంద్రంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మకర సంక్రాంతి ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే హిందూ పండగలను ప్రతీ ఒక్కరు వైభవంగా జరుపుకోవాలని కోరారు. విదేశీ సంస్కృతికి భారతీయతకు ఎలాంటి ముడిపడిలేని పండుగలకు ప్రధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. భారతీయ సంస్కృతితో పాటు మన జీవన విధానానికి దగ్గరగా ఉన్న పండుగల్లో సంక్రాతి ఒకటన్నారు. ప్రతీ ఒక్కరు మకర సంక్రాతిని ఆనందంగా, సంప్రదాయంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సోమరాజు, అజయ్, మల్లేశం, రమేశ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కొండపైన కొలువైన స్వయంభు లక్ష్మీనర్సింహ స్వామికి పూజలు



చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. ఏటా స్వామివారి ఉత్సవాలు ధనుర్మాసంలో ప్రారంభమై 3 నెలల పాటు ప్రతీ ఆదివారం ఉత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరు పక్కనున్న ఆలయంతో పాటు కొండపై కొలువైన స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించమన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

గ్యాస్ కోసం గ్రామస్తుల నిరసన

శివ్వంపేట(నర్సాపూర్): వారం రోజుల నుంచి వంట గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం నవాబుపేట గ్రామంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండగ వేల వారం రోజుల నుంచి గ్యాస్ సరఫరా కాకపోవడంతో వంట చేసుకునేందుకు ఇక్కట్లు పడాల్సి వస్తుందని ఆరోపించారు. భారత్, హెచ్‌పీ ఏజెన్సీలకు సంబంధించిన గ్యాస్ కలెక్షన్లు ఉన్నాయని, గ్యాస్ సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్‌పై ఆధారపడి ఉండగా కనీసం వంట చెరుకు కూడా అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి.. గ్యాస్ సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

గెలుపు ఓటములు క్రీడాకారులకు సహజం



బహుమతిని అందుకుంటున్న నామాపూర్ కబడ్డీ జట్టు

చేగుంట(తూప్రాన్): క్రీడాకారులకు గెలుపు ఓటములు సహజమని మక్కరాజీపేట మాజీ సర్పంచ్ రఘువీర్‌రావు అన్నారు. మండలంలోని మక్కరాజీపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి గెలుచుకున్న టీంకు రూ.10 వేల నగదుతో పాటు కప్‌ను అందించారు. సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు విశ్వేశ్వర్‌రావు, గ్రామ వార్డు మెంబర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయోధ్య అక్షింతల ఊరేగింపు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో అయోధ్య రామ మందిర అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామ కీర్తనలతో ర్యాలీ చేశారు. ఇందులో భాగంగా దొంతి వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేసి, అక్షింతలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ నాయకుడు అంజి, భక్తులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

నర్సాపూర్: పట్టణంలోని పదో వార్డులో ఆదివారం అయోధ్య అక్షింతలు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చిన అక్షింతలు, రామమందిర చిత్రపటాన్ని కౌన్సిలర్లు బుచ్చేష్‌యాదవ్, రాజేందర్‌లతో పాటు కాలనీవాసులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందజేశారు. ఈనెల 20వరకు అక్షింతల వితరణ కొనసాగుతుందని వారు చెప్పారు.

కౌల్దారం(నర్సాపూర్): అయోధ్యలో రాములవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని కౌల్దారం, వరిగుంతం, సంగాయిపేట గ్రామాల్లో దేవాలయ అర్చకులు పూజలు చేసి, అక్షంతలను ఊరేగించారు. రామ నామ సంకీర్తనతో ఇంటింటికీ తిరుగుతూ అక్షంతలను అందజేశారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎం.జలాల్‌పూర్ గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. శ్రీ విఠలేశ్వర భజనమండలి ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో కళశాలకు పూజలు నిర్వహించి భజనలు, రామ సంకీర్తనలు ఆలపిస్తూ మంగళహారతులతో గ్రామంలో అక్షింతలను ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అక్షింతలు, కరపత్రం, జెండాను అందించారు.



శివ్వంపేట(నర్సాపూర్): దొంతిలో అక్షింతలు ఊరేగింపు



నర్సాపూర్‌లో అయోధ్య అక్షింతలు అందిస్తున్న నాయకులు



వెల్దుర్తి(తూప్రాన్): ఎం.జలాల్‌పూర్‌లో అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు



కౌల్దారం(నర్సాపూర్): సంగాయిపేటలో..



కౌల్దారంలో అక్షింతల ఊరేగింపు

కబ్జా చేసినవాళ్లే కేసుపెడతారా..!



మాట్లాడుతున్న సర్పంచ్, ఉపసర్పంచ్

కౌడిపల్లి(నర్సాపూర్): అటవీభూమిని కబ్జా చేసి తమపైనే కేసు నమోదు చేయడం ఇదెక్కడి న్యాయమని నాగ్సాన్‌పల్లి సర్పంచ్ ఎల్లం, ఉపసర్పంచ్ నరహరి, రైతు భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామశివారులోని బేసిక్‌బ్రీడర్స్ ఇండియ ప్రైవేట్ లిమిటెడ్ పౌల్ట్రీఫాం యజమానులు సుమారు 20ఎకరాల వరకు అటవీభూమిని కబ్జా చేయగా, అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో ఎఫ్ఆర్ఓ అంబర్‌సింగ్, డీఎఫ్ఓ రవిప్రసాద్, గ్రామస్తులతో కలిసి కబ్జాకు గురైన భూమిని పరిశీలించారని తెలిపారు. కాగా పౌల్ట్రీఫాం యజమానురాలు లక్ష్మిబంజార పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు మరో 20 మందిపై కేసు నమోదు చేశారని చెప్పారు. డీఎఫ్ఓ పరిశీలించే సమయంలో పౌల్ట్రీఫాం యజమాని లేదని, సిబ్బంది ఉన్నారని వివరించారు.. భూమి అమ్మాలని ఫోన్ సైతం చేయలేదని, అలాంటిది తమపై కేసుపెట్టారని కేసుపెట్టడం ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని అంసాన్‌పల్లి గ్రామంలోని గంగమ్మ ఆలయంలో దొంగలు చోరీ చేసిన సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. చోరీకి సంబంధించి గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలోని చెరువు కట్ట వద్ద ఉన్న గంగమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం పూజలు చేయడానికి వెళ్లిన భక్తులకు దేవాలయ తలుపులకు తాళం, పక్కనే హుండీ తాళం పగలగొట్టి ఉంది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ గౌస్ దేవాలయం వద్దకు చేరుకొని గ్రామస్తులతో చోరీకి సంబంధించిన ఆరా తీయగా ఆలయంలోని అమ్మవారి బంగారు ముక్కుపుడకలతో పాటు వెండి ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వీటితో పాటు గత సంవత్సరం నుంచి హుండీలోని డబ్బులు దాదాపు రూ.లక్ష వరకు నగదు ఎత్తుకెళ్లినట్లు వివరించారు.

ఎల్లమ్మదేవి ఆలయంలో చోరీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి సమీపంలోని 765డి జాతీయ రహదారి పక్కన ఉన్న గౌడసంఘం శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో గ్రామానికి చెందిన చంద్రం వెంకటేశంగౌడ్ రోజు మాదిరిగా శనివారం రాత్రి పూజలు చేసి ఇంటికొచ్చాడు. ఆదివారం ఉదయం ఆలయానికి వెళ్లగా తలుపు తాళం, హుండీ తాళం పగులగొట్టి ఉన్నాయి. హుండీలో ఉన్న సుమారు రూ.15 వేలు ఎత్తుకెళ్లారు.



హుండీ తాళం పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

తునికిలో వరుస చోరీలు :

మండలంలోని తునికి గ్రామం, తునికి గేట్ వద్ద వరుసగా చోరీలు జరగడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గురువారం అర్ధరాత్రి తునికి గేట్ వద్ద గల శ్రావణ్ కిరాణం డబ్బాలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దొంగలు ముసుగు ధరించి చోరీ చేస్తున్నట్లు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యింది. అదే రోజు రాయిలాపూర్‌లో కన్నారం సంజీవ్, ఎన్నెరి క్రిష్ణ ఇంటికి తాళం ఉండగా దొంగలు తాళం పగులగొట్టి చోరీ చేసినట్లు గ్రామస్తులు చెప్పారు. శనివారం రాత్రి సైతం తునికి నల్లపోచమ్మదేవి ఆలయం వద్ద గల శేఖర్‌గౌడ్ కిరాణం షాపులో చోరీ జరిగింది. ఈ ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.